క్లుప్తంగా

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే

తెర్లాం: మండలంలోని రాజయ్యపేట గ్రామంలో అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు సాయం చేసి, తనలోని మానవత్వాన్ని చాటుకున్నారు. సారిపెంట ఈశ్వరరావు, రమణమ్మ ఇంట్లో ఇటీవల గ్యాస్ లీకై, ఇంట్లో ఉన్న అన్ని వస్తువులు, దుస్తులు కాలిబూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శనివారం సాయంత్రం ఆ గ్రామానికి వెళ్లి, వారిని పరామర్శించారు. అనంతరం ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వారు నిరుపేదలు కావడంతో వారికి దుస్తులు, నిత్యవసర సరుకులు, కొంత నగదును వితరణ చేశారు.

ఎమ్మెల్యేకు భూ హక్కు పత్రం అందజేత

బొబ్బిలి: జగనన్న శాశ్వత భూ హక్కు–భూరక్ష కార్యక్రమం పేరిట రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వేతో రైతులు, భూ యజమానులకు ఎంతో మేలు జరుగుతోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. శనివారం మండలంలోని రాముడువలస గ్రామంలో ఎమ్మెల్యే భూములకు సంబంధించి, భూ హక్కు పత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు.

ఎంపీ పరామర్శ



వెంకటరత్నం కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీ బెల్లాన, తదితరులు

రేగిడి: మండలంలోని కాగితాపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దూబ వెంకటరత్నం కుటుంబాన్ని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ శనివారం పరామర్శించారు. వెంకటరత్నం చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఆమె కుమారు, హైకోర్టు సీనియర్ న్యాయవాది దూబ వెంకటనాగార్జునబాబును, అల్లుడైన హైకోర్టు సీనియర్ న్యాయవాది మామిడి వేణుగోపాలనాయుడుని పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట రేగిడి వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, వైఎస్సార్‌సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, మామిడి సూర్యతేజ, దూబ రమేష్‌బాబు, రైల్వే బోర్డు డైరెక్టర్ తాడేల ఉమ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాసామగ్రి వితరణ

బాడంగి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు దాదాపు రూ.20 వేల విలువైన క్రీడాసామగ్రిని బాగువలస గ్రామానికి చెందిన వ్యాపారవేత్త అల్లు రవి కుమార్ శనివారం వితరణ చేశారు. ప్రధానోపాధ్యాయుడు డి.సత్యనారాయణ మాట్లాడుతూ దివ్యాంగులకు సహాయ సహకారాలు అందించేందుకు ముందుకు వస్తున్న దాతలందరికీ ధన్యవాదాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయుడు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

బొబ్బిలి: సీఎంఆర్ఎఫ్(ముఖ్యమంత్రి సహాయ నిధి) పేదలకు వరం లాంటిదని, పేద ప్రజలంతా దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కోరారు. శనివారం ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో మండలంలోని పారాది గ్రామానికి చెందిన అల్లాడ కుమారికి వైద్యం నిమిత్తం మంజూరైన రూ.1.40 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. అన్ని వర్గాల ప్రజలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంచి మనసుతో ఆదుకుంటుండడం చాలా సంతోషమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ బొత్స రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

రామభద్రపురం: మండల కేంద్రంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడును రెగ్యులర్ అయిన కాంట్రాక్టు ఉద్యోగులు శనివారం కలిసి, ఆయనకు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ చేపట్టి, వేలాది మంది కాంట్రాక్టు ఉద్యోగులకు సీఎం జగన్ సార్ మేలు చేశారన్నారు. గతంలోని ప్రభుత్వం తమకు రెగ్యులరైజ్ చేస్తామని మోసం చేసిందని, ప్రస్తుతం అధికారంలోని వైఎస్సార్ సీపీ మాత్రం చట్టసభల్లో తీర్మానం చేసి, చరిత్రలో నిలిచిపోయే నిర్ణయం తీసుకుందన్నారు. రాజకీయాల్లో ఉన్నంత వరకు వైఎస్సార్ సీపీకే తమ మద్దతు అని కాంట్రాక్టు ఉద్యోగులు తెలిపారు.

పార్టీ మండల అధ్యక్షునిగా 'రాయిపిల్లి'

మెంటాడ: వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడిగా ఇద్దనవలస గ్రామానికి చెందిన స్థానిక సర్పంచ్ రాయిపిల్లి రామారావు నియమితులయ్యారు. ఇదే విషయాన్ని ఆయన శనివారం సాక్షి విలేకరితో వెల్లడించారు. తనను నమ్మి ఇంతటి బాధ్యతను అప్పగించిన పార్టీకి, పార్టీ అధినేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర, మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలని తెలిపారు. పార్టీ మరింత బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

రేగిడి: నాడు–నేడు పనులు వేగంగా పూర్తిచేయాలని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు కాంట్రాక్టర్లకు సూచించారు. మండలంలో లింగాలవలస, పెద్దకోడిశ, చిన్నకోడిశ తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు రెండో విడత పనులను శనివారం పరిశీలించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, కాంట్రాక్టర్లతో మాట్లాడారు. సకాలంలో పనులు చేయించకుంటే బిల్లులు నిలిచిపోతాయన్నారు.



బొబ్బిలి: పక్కి గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది



బాడంగి: పిన్నవలసలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం వివరిస్తున్న ఎంపీపీ గౌరి

జగనన్న ఆరోగ్య సురక్ష..
ప్రజారోగ్యానికి భరోసా..



బొబ్బిలి: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కౌన్సిలర్ సునీత



రాజాం : రాజీపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు



రామభద్రపురం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేరిట రాష్ట్ర ప్రభుత్వం శనివారం నిర్వహించిన వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. రోగులకు 15 రకాల వైద్య పరీక్షలు చేయడంతో పాటు 172 రకాల మందులు ఉచితంగా అందజేశారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని ఆస్పత్రులకు రిఫర్ చేశారు. ప్రజారోగ్యానికి భరోసానిచ్చే ఈ కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ప్రజాప్రతినిధులు కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



వంగర: రోగులకు స్పెషలిస్ట్ వైద్యులు తనిఖీలు పరిశీలిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ, మండల పార్టీ కన్వీనర్ కరణం సుదర్శనరావు, జేసీఎస్ మండల కన్వీనర్ మరిశర్ల విజయలక్ష్మి, అధికారులు



సంతకవిటి: హొంజరాంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్డులు అందిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్మోహనరావు



తెర్లాం: కూనాయవలసలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఎమ్మెల్యే శంబంగి

సీఎం జగన్‌కు ప్రజల అండదండలు

• ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి భగవంతుని ఆశీస్సులు, ప్రజల అండదండలు మెండుగా ఉన్నాయని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం జగనన్న పేదలకు అన్ని విధాలా అండగా నిలుస్తున్నారని, 2024 ఎన్నికల్లో తమ ఓటు ద్వారా పూర్తి మద్దతు తెలిపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. క్షేత్రస్థాయిలో అందుకు తగ్గ సానుకూల పరిస్థితులు ఉన్నాయి కాబట్టే ప్రతిపక్షాలు ఒంటరిగా పోటీ చేసేందుకు భయపడుతున్నాయన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన స్కిల్ కుంభకోణంతో ఆ పార్టీ ప్రజల్లో పూర్తి విశ్వాసం కోల్పోయిందన్నారు. అవినీతిపరుడైన చంద్రబాబు ప్రస్తుతం జైలులో ఉండడంతో ఆ పార్టీ నాయకులకు ఏమి చేయాలో తోచక దీక్షలు, ధర్నాలు చేస్తూ ఆ పార్టీ ఉనికిని కాపాడుకునే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అధికార పార్టీయే కక్షతో అరెస్టులు చేయిస్తోందని రాద్ధాంతం చేస్తూ సానుభూతి పొందే వ్యూహాలను టీడీపీ పన్నుతోందని విమర్శించారు. అయినా ప్రజలంతా వైఎస్సార్ సీపీ వైపే ఉన్నారని, వచ్చే ఎన్నికల్లోనూ సీఎం జగనన్నే మళ్లీ సీఎం అవ్వడం ఖాయమని జోష్యం చెప్పారు. విజయదశమి నుంచి విశాఖపట్నం నుంచి సీఎం పాలన సాగిస్తారని, దీనిని ఉత్తరాంధ్ర నాయకులంతా స్వాగతించాలని కోరారు. ఇదిలా ఉండగా, సోంపురంలో ఎంపీటీసీ పప్పల నారాయణమ్మ, పప్పల తవిటియ్య దంపతుల పెద్ద కుమారుడు ఈశ్వరరావు అనారోగ్యంతో మృతి చెందగా, ఆ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కలిసి, పరామర్శించారు. పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మెనూ అమలులో లోపాలుంటే చర్యలు



మధ్యాహ్న భోజనం రుచి చూసి, పరిశీలిస్తున్న ఎంఈవో త్రినాధరావు

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న జగనన్న గోరుముద్ద పథకం మెనూ అమలులో ఎటువంటి లోపాలున్నా చర్యలు తీసుకునేందుకు వెనకాడేదిలేదని ఎంఈవో జె.త్రినాధరావు హెచ్చరించారు. మండలంలోని కాలంరాజుపేట యూపీ స్కూల్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగే ప్రార్థన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇటీవల హత్యకు గురైన పాఠశాల ఉపాధ్యాయుడు ఏగిరెడ్డి కృష్ణ మాస్టారి మృతికి సంతాపం తెలియజేస్తూ విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మౌనం పాటించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, పాఠశాల రికార్డులు, మరుగుదొడ్ల నిర్వహణ, జగనన్న గోరుముద్ద పథంలో మెనూ అమలును పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తూనే రుచి,శుచితో కూడిన భోజనం అందించాలని తెలిపారు.

ఆకట్టుకున్న పౌష్టికాహార ప్రదర్శన



పౌష్టికాహార ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: మండలంలోని కూనాయవలస గ్రామంలో ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ పీవో కె.రాజ్యలక్ష్మి, తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి ఆధ్వర్యంలో స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు శనివారం ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శన ఆకట్టుకుంది. అక్కడి పౌష్టికాహార స్టాల్స్‌ను ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, సర్పంచ్ విజయబాబు, మండల ప్రత్యేకాధికారి, చీపురుపల్లి డీఎల్‌డీవో వి.లక్ష్మణరావు, ఎంపీడీవో శంబంగి రామకృష్ణ పరిశీలించారు. చిరుధాన్యాలు, అంగన్‌వాడీ కేంద్రం ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహార పదార్థాలతో తయారు చేసిన ఆహార పదార్థాలను వారు రుచి, చూశారు. ఆహార పదార్థాలు ఎంతో బాగున్నాయని అంగన్‌వాడీ సిబ్బందిని అభినందించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే పరిహారం

• ఆర్‌డీవో శేషశైలజ



మాట్లాడుతున్న ఆర్‌డీవో శేషశైలజ

రామభద్రపురం: ప్రభుత్వ నిబంధనల ప్రకారమే తొలగించిన ఇళ్లకు పరిహారం ఇవ్వడం జరుగుతుందని ఆర్‌డీవో శేషశైలజ అన్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా తారాపురం గ్రామంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న ఇళ్లను తొలగించాల్సి ఉండగా, స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె ఆ గ్రామ ప్రజలు, పెద్దలతో శనివారం సమావేశమయ్యారు. కొన్ని రూ.లక్షలు పెట్టి, నిర్మించుకుని, దశాబ్దాలుగా నివశిస్తున్న తమ ఇళ్లను తొలగించి, అన్యాయం చేయవద్దని, ఎక్కడైనా తమకు ఇళ్ల స్థలాలు చూపి, వాటిలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని గ్రామస్తులు ఆర్‌డీవోను కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉండడం వల్లే తొలగించక తప్పడం లేదన్నారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి, ల్యాండ్ ఎక్విజియేషన్‌లో భాగంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు అన్యాయం చేసే నిర్ణయాలను ప్రభుత్వం తీసుకోదన్నారు. గొంతెమ్మ కోర్కెలు కోరకుండా న్యాయబద్ధమైన కోర్కెలు కోరాలని సూచించారు. అనంతరం వీఆర్‌వోలతో సమావేశం నిర్వహించి, మండలంలోని అసైన్డ్ భూములు ఎంతమంది రైతుల సాగులో ఉన్నాయో తహసీల్దార్ రాజారావును అడిగి తెలుసుకున్నారు. ఏళ్ల తరబడి అసైన్డ్ భూములు సాగు చేస్తున్నప్పటికీ హక్కులు పొందని వారికి పట్టాల పంపిణీకి చర్యలు చేపడుతున్నామన్నారు.

బకాయి రుణాలను వసూలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఉమాలక్ష్మి

తెర్లాం: వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా డ్వాక్రా గ్రూపు సభ్యులకు ఇచ్చిన వివిధ రకాల రుణాలకు సంబంధించి, బకాయి రుణాల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి సూచించారు. శనివారం సాయంత్రం స్థానిక వెలుగు కార్యాలయంలో వీవోఏలు, సీసీలతో ఆమె సమావేశమై, రుణాల వసూళ్లపై సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ క్రాంతి పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన ఉన్నతి రుణాలకు సంబంధించి, బకాయి ఉన్న రూ.67.78 లక్షలు, స్త్రీనిధికి సంబంధించి రూ.11.96 లక్షల బకాయిలను వెంటనే లబ్ధిదారుల నుంచి వసూలు చేయాలని తెలిపారు. రుణాల వసూళ్లలో అలసత్వం ప్రదర్శించొద్దని, రుణ వసూళ్ల లక్ష్యాలను శతశాతం పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్ చిరంజీవి, స్త్రీనిధి మేనేజర్ సుధాకర్, సీసీలు శ్రీనివాస్, కేశవరావు, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం

• ఎమ్మెల్యే కంబాల జోగులు



సంక్షేమ లబ్ధిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రేగిడి: పేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో శనివారం 'గడపగడపకుమ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ లబ్ధిపత్రాలు అందించి అందులో ఉన్న పథకాలు అందాయా లేదా అని ఆరాతీశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వం అమలుచేయనన్ని సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. పథకాల అమలులో ఎలాంటి అవినీతికి తావులేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోనే నగదు జమ చేస్తున్నట్లు చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వం సంక్షేమాన్ని పూర్తిగా కాలరాసిందని, ఐదేళ్లు రాష్ట్రాన్ని దోచుకున్నారని దుయ్యబట్టారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు మరింత అంకితభావంతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, పోలేటి కార్పొరేషన్ డైరెక్టర్ కింజరాపు సురేష్‌కుమార్, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు గొలివి జగ్గునాయుడు, ఎంపీటీసీ కింజరాపు వాగ్దేవి, చీపురుపల్లి ఆర్‌డీఓ ఎం.అప్పారావు, తహసీల్దార్ పి.సుదర్శనరావు, ఎంపీడీఓ శ్యామలాకుమారి, ఈఓపీఆర్డీఓ హేమసుందరరావు, పంచాయతీ కార్యదర్శి పోలినాయుడు, విప్ మజ్జి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు కెంబూరు వెంకటేశ్వరరావు, కరణం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి

వంగర: ప్రాథమిక స్థాయి నుంచి పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ అన్నారు. యూకేగుమ్మడ జెడ్పీ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యాప్రమాణాలు, పాఠశాల రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందని, విద్యారంగంలో సమూల మార్పులు తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, జేసీఎస్ మండల కన్వీనర్ మరిశర్ల విజయలక్ష్మి, ఎంపీడీఓ హనుమంతు శశిభూషణరావు, హెచ్‌ఎం సోమేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారాబ్యాడ్మింటన్ విజేతకు సత్కారం



రూపాదేవిని సత్కరిస్తున్న ఓల్డ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు

రాజాం సిటీ: అంతర్జాతీయ స్థాయిలో పారాబ్యాడ్మింటన్ విజేత రూపాదేవికి స్థానిక ఓల్డ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు శనివారం సత్కరించారు. రెండు కాళ్లు లేకపోయినప్పటికీ అంతర్జాతీయ స్థాయిలో పారాబ్యాడ్మింటన్ సింగిల్స్, డబుల్స్, మిక్సిడ్ డబుల్స్‌లో రజిత పతకం సాధించిన రూపాదేవి పలువురికి ఆదర్శమని అసోసియేషన్ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ అన్నారు. ఆమె భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి బీవీ అచ్యుత్‌కుమార్, ప్రభుత్వ డిగ్రీకళాశాల అధ్యాపకులు పి.సూర్యారావు, యూఎస్ యాదవ్, రెయ్యి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

బొబ్బిలి: స్థానిక పట్టణంలో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం జరిగింది. మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో భోజరాజపురం హెడ్ వాటర్ వర్క్స్ వద్ద మరమ్మతులకు గురవుతున్న మెషినరీ, పైప్‌లైన్ పనుల కోసం తాత్కాలికంగా నలుగురు సిబ్బందిని నియమించేందుకు మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చెలికాని మురళి, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

తెర్లాం: మండలంలోని గొలుగువలస గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు సాకేతి గణపతి కుటుంబాన్ని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు శనివారం సాయంత్రం పరామర్శించారు. గణపతి మాస్టారు తండ్రి, కొరటాం ఎంపీటీసీ సాకేటి నాగమణి మామ అయిన పాపినాయుడు శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఆ గ్రామం చేరుకుని, గణపతి మాస్టారు కుటుంబాన్ని కలిసి పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట గొలుగువలస, కొరటాం సర్పంచ్ ప్రతినిధులు జి.శంకరరావు, సీహెచ్ శ్రీకాంత్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు టి.సత్యంనాయుడు తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

• సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు

రాజాం సిటీ: విద్యాహక్కు చట్టంపై విద్యార్థులు అవగాహన కలిగిఉండాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు అన్నారు. పొగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల న్యాయసేవాధికార సంఘం ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాహక్కు చట్టంపై న్యాయమూర్తి అవగాహన కల్పించారు. 6–14 సంవత్సరాల మధ్య వయసుగల పిల్లలకు ఉచిత విద్య అందుబాటులో ఉందన్నారు. బాలబాలికలు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పౌరులకు ప్రాథమిక హక్కులతో పాటు విధులు ముఖ్యమేనని తెలిపారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ, న్యాయవాదులు రెడ్డి విజయ్‌కుమార్, ముదిలి శ్రీనివాసరావు, జె.అప్పలనాయుడు, హెచ్‌ఎం శాసపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శతశాతం ఈకేవైసీ చేపట్టాలి

వంగర: రైతులకు శతశాతం ఈకేవైసీ పూర్తి చేయాలని ఏఓ తట్టికోట కన్నబాబు అన్నారు. వంగర రైతుభరోసా కేంద్రంలో చేపడుతున్న రైతుల ఈకేవైసీ నమోదును శనివారం పరిశీలించారు. ఈకేవైసీ చేయించుకున్న రైతులకు ధాన్యం అమ్మకం సమయంలో ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు.

గణపతి లడ్డూ వేలం

రాజాం: పట్టణంలో మారుతీనగర్ 3వ లైన్‌లో ఏర్పాటుచేసిన గణనాథుని మండపం వద్ద శనివారం 3 లడ్డూలను వేలం వేశారు. మొదటి లడ్డూను స్థానికంగా ఉంటున్న రౌతు సతీష్ రూ.58,116కు దక్కించుకోగా.. రెండో లడ్డూను ఎర్నేని పవన్‌కుమార్ రూ.29 వేలకు, మూడో లడ్డూను రూ.35,716లకు కిమిడి మల్లినాయుడు దక్కించుకున్నట్లు కమిటీ సభ్యులు వెల్లడించారు.

ప్రతీ ఇంటి నుంచి మట్టి సేకరణ

రాజాం: మండలంలోని అంతకాపల్లి గ్రామంలో శనివారం మేరా మట్టీ–మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ సర్పంచ్ వాకముల్ల చిన్నంనాయుడుతో పాటు గ్రామ సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి ప్రజల నుంచి కొంచెం మట్టి, బియ్యాన్ని సేకరించారు. వాటిని మండలపరిషత్ కార్యాలయానికి అందజేయనున్నట్లు సర్పంచ్ వెల్లడించారు. కార్యక్రమంలో అంతకాపల్లి పంచాయతీ కార్యదర్శి పి.అప్పలనాయుడు, వీఆర్‌ఓ గెడ్డాపు అనంతరావు, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి బుచ్చెంపేటలో పాఠశాల విద్యార్థులు 'మేరీ మట్టి–మేరా దేశ్' ర్యాలీ నిర్వహించారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపతాయని ఉపాధ్యాయురాలు వి.ఉషారాణి అన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

రాజాం సిటీ: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ అన్నారు. స్వచ్ఛతాహీ సేవా 2.0 కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులచే శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ జంక్షన్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించుకోవచ్చన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పట్టణవాసులంతా సహకరించాలని కోరారు.